క్లుప్తంగా

ప్రభుత్వం దృష్టికి ప్రైవేటు పాఠశాలల సమస్యలు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు పాఠశాలల సమస్యల్ని పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. మురళీమోహన్‌రావు, భీమనాథం పేరిరెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్ పాఠశాలలకు ఆన్‌లైన్‌లో అనుమతుల మంజూరు, గుర్తింపు పునరుద్ధరణలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు అగ్నిమాపక, ఆర్ అండ్ బీ ఎన్‌వోసీలు 10 ఏళ్లకు ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపులో ప్రభుత్వ వాటా భరించే విధంగా కృషి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలలకు గుర్తింపు కాల పరిమితిని మూడేళ్ల నుంచి ఎనిమిదేళ్లకు పెంచిన ప్రభుత్వానికి ఎమ్మెల్సీ టి. కల్పలత, అప్సా ప్రతినిధులు సీహెచ్. రాజేష్ నాయుడు, సీహెచ్. శ్రీనివాసరావు, రాజు, సుబ్బారావు కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థులకు ఉద్యోగ, జీవన నైపుణ్యాలపై శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్ : జేకేసీ కళాశాల విద్యార్థులకు రూబీకాన్ సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ, జీవన, మౌఖిక ఎంపిక నైపుణ్యాలపై నాలుగు రోజుల పాటు శిక్షణ కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు తెలిపారు. ట్రైనర్లు రవిరాజు, షేక్ మస్తాన్, లక్ష్మిలు 200 మంది విద్యార్థులకు శిక్షణ కల్పించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థుల్ని కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి. గోపీచంద్ అభినందించారు.

రేపు కవి సమ్మేళనం

పాత గుంటూరు: బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో బాపు రమణ, బాలు కళాపీఠం నవ్యాంధ్ర రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కవి సమ్మేళనం జరుగుతుందని నిర్వాహకులు బి.జనార్దన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రమణ యశస్వి రచించిన సప్తపదులు పుస్తకావిష్కరణ, అనంతరం సమ్మేళనం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, కవులు పాల్గొనాలని ఆయన కోరారు.

అంతర్జాతీయ సదస్సుల బ్రోచర్ల ఆవిష్కరణ



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. సదస్సు డైరెక్టర్, ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ బి. నాగరాజు మాట్లాడుతూ 'ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఆపర్చునిటీస్ ఇన్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్' అనే అంశంపై మార్చి 15 నుంచి 17 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు.

సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో....

నాగార్జున విశ్వవిద్యాలయ సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ 'నెట్ వర్కింగ్ అండ్ ఇంటర్ ఫేసింగ్ ఆఫ్ నాన్ గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ ఫర్ కన్వర్జెన్స్ ఇన్ సోషల్ యాక్షన్' అనే అంశంపై వచ్చే ఏడాది మార్చి 1, 2 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఆశ్రమానికి అనాథ రోగి అప్పగింత

గుంటూరు మెడికల్: క్యాన్సర్‌తో బాధ పడుతున్న అనాథకు చికిత్స చేసి సేవా సంస్థకు అప్పగించినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. వారం రోజుల కిందట అరండల్‌పేట నుంచి అంబులెన్స్‌లో నాట్కో క్యాన్సర్ ఆసుపత్రికి ప్రసాద్ అనే వ్యక్తిని తీసుకు వచ్చారని చెప్పారు. క్యాన్సర్ విభాగం వైద్యులు సేవలు అందించారని తెలిపారు. ఆయన కోసం ఎవరూ రాకపోవడంతో ఆర్.ఆర్. మూర్తి వృద్ధుల సేవా సంస్థకు అప్పగించినట్లు చెప్పారు. నాట్కో సెంటర్ నుంచి పాత గుంటూరు లోని సేవా సంస్థ అంబులెన్స్‌లో ప్రసాద్‌ను తీసుకుని వెళ్లినట్లు చెప్పారు. రోగిని అక్కున చేర్చుకున్న సంస్థ నిర్వాహకులు ఆర్.రామమూర్తి, ఆర్.ప్రసూనాదేవికి సూపరింటెండెంట్ కృతజ్ఞతలు తెలిపారు.

బతుకు బండికి 'గ్యాస్ ట్రబుల్'

- ఆధునిక జీవనశైలితో పెరుగుతున్న సమస్యలు
- ఛాతిలో, గుండెలో మంటతో అవస్థలు
- జీజీహెచ్‌కు క్యూ కడుతున్న బాధితులు
- ముందస్తు జాగ్రత్తలతో సమస్య నుంచి నివారణ



గుంటూరు మెడికల్ : అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు ఆహారం తీసుకోవడం.. అది కూడా ఫాస్ట్‌ఫుడ్స్, జంక్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం ద్వారా నేడు పలువురు గ్యాస్ ట్రబుల్ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

ఆధునిక జీవనశైలి వల్ల కూడా బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. గ్యాస్ ట్రబుల్ వల్ల ఛాతిలో, గుండెలో మంట వస్తుండటంతో గుండెపోటు వస్తుందేమోననే భయంతో వైద్యులకు వద్దకు పరుగులు తీస్తున్నారు. వ్యాధి సోకిన వారు ఓ పట్టాన సక్రమంగా కూర్చోలేకపోవడం, సక్రమంగా తినలేకపోవడం బాధాకరం. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స చేయని పక్షంలో తీవ్ర ప్రమాదానికి దారి తీస్తోంది. గుంటూరు జీజీహెచ్‌కు ప్రతిరోజూ ఛాతిలో మంట బాధితుల సంఖ్య పెరిగిపోవడంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధిపై అవగాహనతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల కట్టడి చేయవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

రిఫ్లక్స్ గ్యాస్ సమస్య

సాధారణంగా మనం నోటితో తీసుకున్న ఆహారం నాళం ద్వారా కిందకు వెళ్లి పొట్టలోకి చేరుతోంది. అక్కడ రెండు గంటల పాటు ఉంటుంది. పొట్టలోని యాసిడ్‌తో కలసి కదలికలతో చిన్న చిన్న ముక్కలుగా చేయబడి తరువాత పైలోరస్ ద్వారం దాటి చిన్నపేగులోకి వెళుతోంది. కొన్ని కారణాల వల్ల పొట్టలో ఉన్న యాసిడ్‌తో కలసిన ఆహారం జీఈ జంక్షన్ ద్వారం దాటి మరలా వెనుకకు పైన ఉన్న ఆహార నాళంలోకి రిఫ్లక్స్ అవుతోంది. తద్వారా రోగికి ఛాతిలో మంట, తేపులు, గొంతులో మంట వస్తాయి.

కారణాలు

ధూమపానం, ఆల్కాహాల్ వల్ల జీఈ జంక్షన్ ద్వారం వదులుగా మారి మంట వస్తుంది. పొట్ట బిగుతుగా ఉండటం వల్ల (కడుపునిండుగా తినడం వల్ల), బిగుతు దుస్తులు, పొట్ట బిగుతు చేసే వ్యాయామం వల్ల, నిండు గర్భిణికి పొట్ట వల్ల ఛాతిలో మంట వస్తుంది. ఆహారం తిన్న తరువాత రెండు గంటల్లోపు వెల్లికలా పడుకోవడం లేదా ముందుకు వంగడం వంటి పనులు చేయడం వల్ల, పొట్టలోని ఆహారం థైరాయిడ్, షుగర్ వల్ల ఆలస్యంగా ముందుకు కదలడం వల్ల ఛాతిలో మంట వస్తుంది.

లక్షణాలు

- గుండెలో మంట, తేపులు,
- నోటిలో లాలాజలం ఊరడం,
- గుండెలో, గొంతులో పట్టినట్లు ఉండటం
- గొంతులో ఏదో అడ్డుపడినట్లు ఉండటం
- గొంతు మంట, గొంతు బొంగురుపోడడం
- చెవి, గొంతు, పంటి నొప్పి
- గ్యాస్ పైకి తన్నడం, దీర్ఘకాలిక దగ్గు
- నోటి దుర్వాసన, ఆయాసం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వదులుగా ఉండే దుస్తులు ధరించాలి. కొంచెం కొంచెం ఆహారం ఎక్కువ సార్లు తినాలి. తిన్న తరువాత రెండు గంటల వరకు నిటారుగా కూర్చొని లేదా నిలబడి చేసే పనులు చేయాలి. తిన్న తరువాత రెండు గంటల వరకు వంగి చేసే పనులు ఏమీ చేయకూడదు. వేగంగా నడక, సైకిల్ తొక్కడం వంటి వ్యాయామాలు చేయాలి. ఆహార నియమాలు పాటించాలి. పొట్ట పెరగకుండా చూసుకోవాలి. బరువు తగ్గించుకోవాలి. తల ఎప్పుడూ సాధ్యమైనంత ఎత్తు పెట్టుకుని పడుకోవాలి.

పాటించాల్సిన ఆహార నియమాలు

బిర్యానీలు, చాక్లెట్లు, పచ్చి ఉల్లిపాయలు, మసాలా పదార్థాలు, కాఫీ, నిమ్మరసం, టమోటా సాస్ తగ్గించాలి. ధూమపానం, ఆల్కాహాల్, గుట్కా, ఖైనీ, పాన్‌పరాగ్, నొప్పి మాత్రలు, ఊరగాయ పచ్చళ్లు తిన్న వెంటనే పడుకోవడం పూర్తిగా మానేయాలి.

గుంటూరు జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు



రిఫ్లక్స్ గ్యాస్ సమస్య బాధితులకు గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నాం. 2020లో 6720 మంది, 2021లో 8160 మంది, 2022లో 10,123 మంది, 2023లో అక్టోబరు నాటికి 9,676 మంది చికిత్స పొందారు. ప్రతి ఏడాది గ్యాస్ సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. వ్యాధిపై అవగాహన కలిగి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, జీవన శైలి మార్చుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు. రిఫ్లక్స్ అనేది షుగర్, బీపీలాగా దీర్ఘకాలిక వ్యాధి. జాగ్రత్తలు పాటిస్తూ అప్పుడప్పుడు మందులు వాడితే ఇబ్బంది ఉండదు. జాగ్రత్తలు తీసుకోకపోతే అల్సర్లు, క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులు వస్తాయి.

– డాక్టర్ నాగూర్‌బాషా,
గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్

దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిన రాష్ట్రం

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

గుంటూరు ఎడ్యుకేషన్: సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 18, 25, 36, 38, 39, 45 డివిజన్లలోని ఆర్. అగ్రహారం కావటి శంకరరావు కల్యాణ మండపం, కేపీపీ కాలనీ, శ్యామలానగర్ రైల్వేగేటు, కొరిటిపాడు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలోని వార్డు సచివాలయాల్లో నవరత్నాల లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డుల్ని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయ మద్దతు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని అప్పు ఊబిలోకి నెట్టివేసిన గత టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి జాడ లేకుండా ప్రజలకు అన్యాయం చేసిందని విమర్శించారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దిశ, నిర్దేశం ప్రకారం నగరంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ప్రజలకు ప్రభుత్వం ఏమేం చేసిందో చెబుతూ బుక్‌లెట్ సైతం ఇస్తున్నామని, ఈ నాలుగేళ్లలో ఏయే పథకంలో ఏమేం అందాయన్న వివరాలు అందులో ఉంటాయని తెలిపారు. అదే సమయంలో ఈ నాలుగేళ్ల ఏం చేశామన్నది స్పష్టంగా ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. జగనన్న పాలనకు ప్రజలు మద్దతు పలుకుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందకుండా ప్రతిపక్షం అడుగడుగునా అడ్డు తగులుతోందని విమర్శించారు. నీతి, నిజాయతీతో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అట్టడుగు వర్గాలకు అందుతుంటే చూసి తట్టుకోలేక టీడీపీ నేతలు విమర్శలు చేస్తూ అడ్డుకునే కుట్రలకు తెర తీస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే గుంటూరు అతిపెద్ద నగరంగా తీసుకోచ్చే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు షేక్ జుమ్మాబీ, మార్కెట్‌బాబు, యక్కలూరి మారుతీ కోటిలింగారెడ్డి, కాండ్రుగుంట గురవయ్య, చంద్రగిరి కరుణకుమారి, నిమ్మల వెంకటరమణ, 35, 38వ డివిజన్ల ఇన్‌చార్జులు టీఎల్‌వీ వీరాంజనేయులు, బోగిసం శిరీష, క్లస్టర్ ఇన్‌చార్జులు ఏరువ ఇన్నారెడ్డి, బత్తుల దేవానంద్, బందా రవీంద్రనాథ్, ఉడతా కృష్ణ, మొహమ్మద్ బాబూఖాన్, బైరెడ్డి రంగారెడ్డి, సూరసాని వెంకట్ రెడ్డి, నూనె ఉమామహేశ్వరరెడ్డి, గేదెల రమేష్, గుడిపాటి భాస్కరరావు, దుర్గ, దినేష్, శేషాద్రి నాయుడు, టీఎల్‌వీ పవన్, శ్రీనివాస్‌రెడ్డి, పిల్లుట్ల మోహనరావు పాల్గొన్నారు.

రైటింగ్ స్కిల్స్‌లో నైపుణ్యంతోనే విద్యార్థినుల అభ్యున్నతి



గుంటూరు ఎడ్యుకేషన్: లేఖన నైపుణ్యాల(రైటింగ్ స్కిల్స్)ను పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. సాంబశివపేటలోని మహిళా కళాశాలలో శుక్రవారం ఆంగ్ల విభాగ ఆధ్వర్యంలో ''రైట్ యువర్ వే టు ఎంప్లాయిమెంట్'' అనే అంశంపై విద్యార్థినులకు లేఖన నైపుణ్యాలుపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్‌లో భాగంగా రెజ్యూమ్ రైటింగ్, ఈ-మెయిల్ కరస్పాండెన్స్, లెటర్ రైటింగ్, కవర్ లెటర్ అండ్ ఎస్సే రైటింగ్ అంశాలపై విద్యార్థినులకు శిక్షణ కల్పించినట్లు చెప్పారు. ర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ పి. అనంతలక్ష్మి, ఎస్ఆర్ఆర్-సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ ఏ. రోజాలింద్, దర్శి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఏ. నగేష్, కళాశాల విద్య ఓఎస్డీ డాక్టర్ కె. విజయబాబు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించినట్లు తెలిపారు. వర్క్‌షాప్ నిర్వహణలో ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ కె. పద్మజ, కె. చంద్రశేఖరరావు, ఎస్. కుటుంబరావు, జి. శ్రీనివాసులు, ఎస్. శాంతి శ్రీదేవి, పి. అనిత, జి. శేషు, టి. ప్రణయజ సహకారం అందించారని చెప్పారు.

ముట్లూరులో పునీత శౌరి మహోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న గురువులు మార్నేని జోసెఫ్ దిలీప్ కుమార్, ఫాదర్ మాదినేని ప్రకాష్

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం ముట్లూరులోని పునీత శౌరి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 24 నుంచి డిసెంబరు మూడో తేదీ వరకు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా తొలి రోజైన శుక్రవారం పుణ్యక్షేత్రంలో జెండా ప్రతిష్ఠ నిర్వహించారు. విచారణ గురువులు మార్నేని జోసెఫ్ దిలీప్ కుమార్, ఫాదర్ మాదినేని ప్రకాష్ ఆధ్వర్యంలో విశ్వాసులు కొవ్వొత్తుల్ని వెలిగించి దైవ గీతాలాపనలు చేశారు. శౌరివారిని స్తుతిస్తూ గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం దేవాలయం ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం జెండాను ఆవిష్కరించారు. పునీత శౌరి పిలుపు మేరకు జరిగిన ధ్యానాంశంలో ఫాదర్ మాదినేని ప్రకాష్ వాక్యోపదేశం చేశారు. పునీతశౌరి ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు దైవ గీతాలకు నృత్యాలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల్ని ప్రదర్శించారు. విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొని పునీతశౌరిని ప్రార్థించారు.

ఓబీసీలను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

నెహ్రూనగర్: సమాజంలో వెనకబడిన తరగతుల వారిని సామాజిక సమానత్వం సాధించేందుకు కృషి చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉద్యోగాల్లో ఓబీసీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్లకు గండి పడేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇందులో ప్రధానంగా ఓబీసీ కుల గణన చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ కింద అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా ఓబీసీలకు మరింత అన్యాయం జరుగుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఓబీసీ కుల గణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. క్రిమిలేయర్ పద్ధతిలో రూ. 12 లక్షల ఆదాయం కలిగిన కుటుంబాలు రిజర్వేషన్లు కోల్పోయే అవకాశం ఉందని, విద్యాభివృద్ధిలో నేటి తరానికి అతి పెద్ద అడ్డంకిగా మారిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరువల్ల జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల్లో 2016-17 విద్యా సంవత్సరం నుంచి మెడికల్ కోటాలో 15శాతం ఎంబీబీఎస్‌లో, 50 శాతం పీజీలో రిజర్వేషన్లు కోల్పోవాల్సి వస్తుందని వెల్లడించారు. వెంటనే క్రిమిలేయర్‌ను పూర్తిగా తొలగించాలని, లేనిపక్షంలో ఓబీసీలకు సంవత్సరానికి రూ. 30 లక్షల ఆదాయపరిమితి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓబీసీల ఐక్యత చాటుతూ ఈనెల 27న నెల్లూరు జిల్లా కందుకూరులో బీసీ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు కుమ్మర క్రాంతి కుమార్, పారేపల్లి మహేష్, కొల్లూరి హనుమంతరావు, రామకృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

గుంటూరు మెడికల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ మహా పరినిర్వాణ్ దివస్ సంవిదాన్ గౌరవ్ పక్వాడ కార్యక్రమాన్ని శుక్రవారం అరండల్‌పేటలోని జిల్లా ఎస్సీ మోర్చా కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ మోర్చా పిలుపు మేరకు దళితవాడలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గుడిసెల దేవానందం, గుంటూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ధారా అంబేద్కర్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

16 మందితో ఎస్సీ మోర్చా జిల్లా కమిటీ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ సమక్షంలో 16 మందితో ఎస్సీ మోర్చా జిల్లా కమిటీని శుక్రవారం ప్రకటించారు. ప్రధాన కార్యదర్శులుగా బక్క నరసింహారావు (మంగళగిరి), రామ లక్ష్మణ్ (గుంటూరు వెస్ట్), కార్యదర్శులుగా శ్యామ్ మాదిగ, ఊరి గణేష్, దాసరి సింగయ్య, ఉపాధ్యక్షులుగా బుర్రప్రేమ్ కుమార్, కొరవి నాగరాజు, సోషల్ మీడియా కన్వీనర్‌గా పెరికల ఆనందరాజుకు నియామక పత్రాలను అందజేశారు.

లవకుశ చిత్రంలో కుశుని పాత్రతో నా జన్మ ధన్యం

నటుడు నాగ సుబ్రహ్మణ్యం



సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న అతిథులు

పాత గుంటూరు: లవకుశ చిత్రంలో కుశుని పాత్రలో నటించడంతో తన జన్మ ధన్యమయిందని అమలాపురానికి చెందిన వుయ్యూరి నాగ సుబ్రహ్మణ్యం తెలిపారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకులు డాక్టర్ పట్టాభి జయంతి సందర్భంగా పట్టాభి కళాపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవ సభ నిర్వహించారు. సభకు త్యాగరాజ సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా నాగ సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. వివిధ రంగాలలో విశిష్ట వ్యక్తులను గుర్తించి అవార్డులు ప్రదానం చేయడం అభినందనీయం తెలిపారు. 1958లో తన 8వ ఏట నట జీవితం ప్రారంభమైందని చెప్పారు. రెండో నాటకంతోనే మద్రాస్‌కు చెందిన సినిమా యూనిట్ వారు తనను లవకుశ చిత్రానికి కుశుని పాత్రకు ఎంపిక చేశారని తెలిపారు. పూర్వ జన్మ సుకృతంతోనే తనకు ఎన్టీఆర్‌తో కలిసి నటించే అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ నల్లూరి లక్ష్మీరాణికి స్త్రీ శక్తి అవార్డు ప్రదానం చేశారు. నాట్యంలో కె.వి. సుబ్రహ్మణ్యం, శిల్ప కళలో ప్రొఫెసర్ పి. శ్రీనివాసరావు, సంగీతంలో డాక్టర్. పి. ఉమాప్రసాద్, చిత్రలేఖనంలో ఎస్. రాంబాబు, వచన కవిత్వంలో శిఖా ఆకాష్, పర్యావరణంలో గోరిపర్తి శ్రీనివాస్, నాటక రంగంలో తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, వైద్యరంగంలో కె.వి.కె. మహేశ్వరరావు, సాంస్కృతిక సంస్థలో డాక్టర్ పాతూరి అన్నపూర్ణకు పురస్కారాలు, నగదు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అతిథులు కె. హరిబాబు, బొమ్మన రమేష్‌బాబు, ముద్దన నాగరాజకుమారి, కావూరు సత్యనారాయణ, షేక్ గౌస్, సాహితీ వేత్తలు, కళాకారులు, పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

యాంటీబయాటిక్స్ అధిక వినియోగంతో అనర్థాలు

డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు



ర్యాలీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

గుంటూరు మెడికల్: యాంటీబయాటిక్స్ మందులల్ని వైద్యుల సలహా లేకుండా అధికంగా వాడడం వల్ల అనేక అనర్థాలు తలెత్తుతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ వారాన్ని పురస్కరించుకొని శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంటీబయాటిక్స్ వాడడం వల్ల క్రమంగా శరీరంలో వ్యాధినిరోధకశక్తి తగ్గిపోయి మనిషి క్రమంగా బలహీనపడతాడని చెప్పారు. ప్రతీ చిన్న అనారోగ్యానికి యాంటీబయాటిక్స్ వాడాల్సిన అవసరం లేదని సూచించారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని, యాంటీబయాటిక్స్ వినియోగంపై అందరికీ అవగాహన కల్పించాలని తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి మార్కెట్ సెంటర్‌లోని హిందూ కాలేజీ వరకు నిర్వహించిన ర్యాలీలో వైద్యులు, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో అన్నదానం

గుంటూరు మెడికల్: స్థానిక శ్రీనగర్‌లోని మాతృశ్రీ వృద్ధాశ్రమంలో, స్వర్ణ భారతీనగర్‌లోని పిల్లల ఆశ్రమంలో వినోద్‌కుమార్ జయంతి సందర్భంగా పవన్ జోవిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానంతో పాటు దుప్పట్లు, స్కూల్ బ్యాగులు, స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీదా పవన్, రామారావు, స్వాతి నాదెండ్ల, బాలినేని అరవింద్, సురేష్, హేమంత్ పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్య నగర్ 8వ లైనులో నివసించే వెంకట్ శుక్రవారం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తి ఇంటి వెనుక తలుపును బలవంతంగా తెరచి లోపలకు ప్రవేశించాడు. బీరువా పగులగొట్టి అందులోని రూ. 1,70,000ను ఎత్తుకుపోయాడు. వెంకట్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మలబార్‌లో విశిష్ట ఆభరణాల ప్రదర్శన



పాత గుంటూరు: లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో శుక్రవారం విశిష్ట ఆభరణాల ప్రదర్శన (ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యూయలరీ షో)ను డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, ఆధ్యాత్మికవేత్త పెద్ది రమణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ దీప్తిరెడ్డి మాట్లాడుతూ మలబార్‌లో నాణ్యత కలిగిన బంగారు ఆభరణాలు అందరికీ అందుబాటులో ఉన్నాయని గుంటూరు ప్రజలందరూ షోరూంను సందర్శించాలని సూచించారు. స్టోర్ హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపీకిరణ్ మాట్లాడుతూ ప్రదర్శన నవంబర్ 27 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆనం బాలవాణి, శ్రావణి, అన్నపరెడ్డి సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ట్యాలీలో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 26 ఏళ్ల మధ్య వయసు కలిగిన అభ్యర్థులకు ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, వర్క్ ఎథిక్స్ అంశాల్లో బెంగుళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో శిక్షణ కల్పిస్తామని వివరించారు. శిక్షణానంతరం వివిధ సంస్థల్లో రూ.15వేలకు పైగా కనీస నెలసరి వేతనంతో ఉద్యోగం కల్పిస్తామని, నిరుద్యోగ యువతకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9000487423 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని వెస్ట్ ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. వెస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఇష్టానుసారంగా జీబ్రా లైన్లు దాటినా, ట్రిపుల్ రైడింగ్, స్నేక్ డ్రైవింగ్, బైక్ రేస్ చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్ 7వ లైనుకు చెందిన ప్రభు కిశోర్ అప్పుల పాలై కొద్దిరోజుల కిందట కుటుంబ సభ్యుల్ని వదిలేసి వెళ్లిపోయాడు. అతని ఆచూకీ దొరక్క పోవడంతో భార్య బి.చిన్నారి (38) మనస్తాపం చెంది శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు సుద్దపల్లిలో బజరంగ్ నేత్ర జ్యోతి వైద్య శిబిరం

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



చేబ్రోలు: బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలో ఆదివారం బజరంగ్ నేత్ర జ్యోతి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సీఈవో అంబటి మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. అంధత్వ సమస్య నివారణకు గ్రామీణ ప్రాంతాల్లో బజరంగ్ ఫౌండేషన్ నేత్ర జ్యోతి ద్వారా ఉచిత నేత్ర వైద్య శిబిరాలు, అనంతర వైద్య సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన ఆదర్శంగా తీసుకొని సామాజిక సేవా కార్యక్రమాల పరంపరను కొనసాగిస్తున్నట్లు వివరించారు. నేత్ర సమస్యల నుంచి గ్రామస్థులందరికీ రక్షణ కల్పించటమే వైద్య శిబిరం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కంటి సమస్య ఉన్నట్లు గుర్తించిన వారికి ఏడు రోజుల్లోగా కళ్లజోళ్లను అందిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 12,228మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి 9082మందికి కళ్లజోళ్లను అందించినట్లు మురళీకృష్ణ చెప్పారు.